# ప్రపంచ కార్మికులారా.. ఏకంకండి..


ఇల్లెందు : మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకులు

ఉమ్మడి ఖమ్మం జిల్లా మే డే వేడుకల్లో కార్మిక సంఘాల నేతలు

'ప్రపంచ కార్మికులారా ఏకంకండి. శ్రమ దోపిడీ విముక్తి కోసం పోరాడండి. పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప' అంటూ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు నినదించారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మే డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక జెండాలను ఎగురవేశారు. తరువాత కార్మికులంతా కలిసి శ్రామిక జెండాలను చేబూని ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సుదీర్ఘ పోరాటం వల్లనే కార్మికులకు హక్కులు సంక్రమించాయని, ఎనిమిది గంటల పనివిధానం వంటివి అమలవుతున్నాయని గుర్తుచేశారు. కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలోనూ వాడవాడలా మేడే వేడుకలు జరిగాయి. -నమస్తే నెట్‌వర్క్, మే 1



మణుగూరు టౌన్: జెండా ఎగురవేస్తున్న నాయకులు


దమ్మపేట : మేడే వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు


పాల్వంచ రూరల్ : తోగ్గూడెంలో మే డే పతాకావిష్కరణ


దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరంలో..


పాల్వంచ : మేడేలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని


కేటీపీఎస్‌లో మేడే సందర్భంగా మాట్లాడుతున్న టీఆర్‌వీకేఎస్ నేత చారుగుండ్ల రమేష్


టేకులపల్లి : బోడులో మే డే వేడుకలు..


అశ్వారావుపేట : పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు



ములకలపల్లి : మేడే జెండా ఎగురవేస్తున్న నాయకులు


చండ్రుగొండ : మేడే వేడుకల్లో వామపక్షనేతలు


చర్ల : సీపీఎం పార్టీ కార్యాలయం వద్ద..



బూర్గంపాడు : సారపాక సెంటర్లో జెండా ఎగురవేస్తున్న దృశ్యం

## కార్మికులకు సేవలు అందిస్తున్న నాయకుడికి సన్మానం

మణుగూరు టౌన్, మే 1: మేడే సందర్భాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత స్వగృహంలో బీఆర్‌ఎస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘాల నాయకులతో గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దేశ, రాష్ట్ర ప్రగతి కోసం కష్టించి పనిచేస్తున్న శ్రమజీవులకు అండగా నిలబడి వారి సంక్షేమ హక్కుల సాధన కోసం నిస్వార్థంగా సేవలు అందిస్తున్న ఆయా కార్మిక సంఘాల నాయకుల సేవలను గుర్తించి శాలువ కప్పి ఘనంగా సత్కరించారు.


నాగెల్లిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కవిత

## మహిళలకు భద్రతా సౌకర్యాలు కల్పించాలి

ఇల్లెందు, మే 1: మహిళలకు భద్రతా సౌకర్యాలు కల్పించాలని ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రికరెడ్డి అన్నారు. గురువారం ఇల్లెందు కోర్టు ఆవరణంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన న్యాయ చైతన్య సదస్సులో ఆమె మాట్లాడారు. పురుషులతో పాటు మహిళలకు కూడా సమాన హక్కులు, సమాన పని వేళలు, వేతనాలు ఉంటాయన్నారు. మహిళలకు పని ప్రదేశాల్లో యాజమాన్యాలు భద్రతాపరంగా సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

టేకులపల్లి, మే 1: అనారోగ్యంతో బాధపడుతూ మనస్థాపానికి గురైన వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బొమ్మనపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన నారందాస్ వెంకటేశ్వర్లు(55) సంవత్సర నుంచి పెరాలసిస్‌తో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది గురువారం ఉదయం తన ఇంటికి దగ్గరలోని బావి కర్రకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఇన్‌చార్జి ఏవోగా డాక్టర్ సుకృత బాధ్యతల స్వీకరణ

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, మే 1: కొత్తగూడెం డీఎంహెచ్‌వో కార్యాలయం ఇన్‌చార్జి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో)గా డాక్టర్ ఎం.సుకృత గురువారం బాధ్యతలు స్వీకరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మధువరణ్, డాక్టర్ స్పందన, డాక్టర్ తేజశ్రీ, డిప్యూటీ డెమో ప్రైజ్ మొహిఉద్దీన్, సీహెచ్‌వో నాగభూషణం, సూపరింటెండెంట్లు సుదర్శన్, చింగోజీ, జూనియర్ అసిస్టెంట్స్ ఉమామహేశ్వరీ, ధనుజ, అటెండర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

## వేసవి క్రీడలు ప్రారంభం

దమ్మపేట, మే1: మండలంలోని నాగుపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా యువజన, క్రీడా విభాగం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ క్రీడా శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## కృష్ణవేణి విద్యార్థులకు కలెక్టర్, ఎమ్మెల్యే అభినందన

లక్ష్మీదేవిపల్లి, మే 1: ఇటీవలి ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన కృష్ణవేణి కాలేజీ విద్యార్థులను కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం కొత్తగూడెంలో అభినందించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో 994 మార్కులు సాధించిన హాసిని, బైపీసీలో 994 మార్కులు సాధించిన బీ.జోష్ణలను వారు ప్రశంసించారు. అదే విధంగా జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 468 మార్కులు సాధించిన ఆర్.భువన కృతి, బీ.పవిత్రలను, బైపీసీలో 436 మార్కులు సాధించిన ఆయేషా ముమ్మాదిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అత్యుత్తమ మార్కులు సాధించి జిల్లా ప్రగతిని రాష్ట్ర వ్యాప్తంగా ఇనుమడింపజేసిన కృష్ణవేణి విద్యార్థులు అభినందనీయులని అన్నారు. ఉన్నత చదువుల్లోనూ మరిన్ని మంచి మార్కులతో రాణించాలని ఆకాంక్షించారు.


కృష్ణవేణి కాలేజీ విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

## కోర్టు ప్రాంగణంలో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం


మాట్లాడుతున్న జడ్జి, బార్ అధ్యక్షులు

మణుగూరు టౌన్, మే 1: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో గురువారం లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ మాట్లాడుతూ.. కార్మికులు సాధించుకున్న హక్కులు, చట్టపరంగా వారికి రావాల్సిన బెనిఫిట్స్ కార్మిక చట్టాల గురించి వివరించారు. శ్రీనివాసరెడ్డి, సర్వేశ్వరరావు, భాస్కర్‌రావు, పద్మావతి, నరసింహారావు, రవికుమార్, సరస్వతి, అన్వేష్, రాము, రమేష్, వాసవి పాల్గొన్నారు.

## 'సెయింట్ ఆండ్రూస్'లో రెండో దశాబ్ది వేడుకలు

కొత్తగూడెం టౌన్, మే 1: రాష్ట్రంలోనే పేరెన్నికగన్న చర్చి ఆఫ్ సౌత్ ఇండియా, సింగరేణి ఏరియాలో పోస్టాఫీస్ సమీపంలో ఉన్న సెయింట్ ఆండ్రూస్ చర్చి వేడుకలను గురువారం ప్రారంభమయ్యాయి. ఈ చర్చిని పునర్నిర్మించి 20 ఏళ్లు అవుతున్న సందర్భంగా రెండో దశాబ్ది వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో చర్చి ఆఫ్ సౌత్ ఇండియా డోర్నకల్ డయాసిస్ బిషప్ రెవరెండ్ పద్మారావు, విజయకుమారి ముఖ్య అతిథులుగా హాజరై క్రీస్తు సందేశాన్ని అందించారు.

## 'వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు క్రీడాకారులకు వరం'



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం టౌన్, మే 1: వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు క్రీడాకారులకు వరంలాంటివని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం ప్రగతి మైదానంలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరాలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు చిన్నతనం నుంచే తమకిష్టమైన క్రీడలను ఎంచుకొని వాటిల్లో రాణించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ జితేశ్ వి పాటిల్ మాట్లాడుతూ.. ఈ ఏడాది 35 అంశాల్లో క్రీడా శిబిరాలను ఏర్పాటు చేశామని అన్నారు. రాబోయే రోజుల్లో కొత్తగూడెం ప్రాంతం నుంచే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, డీవైఎస్‌వో పరంధామరెడ్డి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ సుజాత, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

### తీర్పు చెప్పిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెం టౌన్, మే 1 : ఓ హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. దుమ్ముగూడెం మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన కారం తులసి, ఆమె భర్త రామకృష్ణ అలియాస్ చిన్న రామకృష్ణది వ్యవసాయ కుటుంబం. రామకృష్ణ క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌గా ప్రైవేట్ ఆర్గనైజేషన్‌లో వలంటీర్‌గా పనిచేసేవాడు. ఈ క్రమంలో భూమి విషయంలో కులస్తులు సోందే ముద్దరాజు కుటుంబానికి, రామకృష్ణ కుటుంబానికి రెండేళ్ల నుంచి తగాదాలు ఉన్నాయి. రెండుసార్లు గ్రామ పెద్దలు పంచాయితీ పెట్టి పరిష్కారం చేసినా గొడవలు సద్దుమణగలేదు. ముద్దరాజు, అతడి కొడుకు రవిలు రామకృష్ణ ఎక్కడ కనిపించినా చంపి తీరుతామంటూ భయపెట్టేవారు. ఈ క్రమంలో 2020, ఫిబ్రవరి 10న తెల్లవారుజామున ఒంటిగంట ప్రాంతంలో రామకృష్ణ, అతడి కుమార్తెతో కలిసి ఇంట్లో నిద్రపోతుండగా ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తన భర్త కాళ్లు, చేతులు పట్టుకోగా.. మరో వ్యక్తి కత్తితో గొంతు కోశాడని, తాను మేల్కొని అడ్డుకోబోగా తనను చంపడానికి ప్రయత్నం చేయగా.. గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చేసరికి అగంతకులు పారిపోయారు. రామకృష్ణను వెంటనే భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో చనిపోయాడని, కచ్చితంగా సోందే ముద్దరాజు, అతడి కొడుకు రవి తదితరులు కలిసి హత్య చేశారని తులసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన అప్పటి సీఐ నల్లగట్ల వెంకటేశ్వర్లు దర్యాప్తులో భాగంగా దుమ్ముగూడెం మండలం లచ్చగూడెంకు చెందిన సోందే రవిబాబు, సోందె ముద్దరాజు, పెనుబల్లి భద్రయ్య, సోందే అర్జున్, పోడియం నగేష్, లచ్చు అలియాస్ లచ్చయ్య, పొడియం భద్రయ్య, చర్ల మండలం గుంపెనగూడెంకు చెందిన పాయం సతీష్‌లు భూ తగాదాలను దృష్టిలో ఉంచుకొని కిరాయి రౌడీలను తీసుకొచ్చి రామకృష్ణ కుటుంబాన్ని చంపడానికి ప్రయత్నం చేశారని చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు నడుస్తున్న క్రమంలో పోడియం భద్రయ్య మృతిచెందడంతో అతడిపై కేసు కొట్టి వేశారు. కోర్టులో 14 మంది సాక్షుల విచారణ అనంతరం రవిబాబు, నగేష్, లచ్చు, ముద్దరాజు, పాయం సతీష్‌లపై నేరం రుజువు కావడంతో జడ్జి వారికి జీవిత ఖైదు, రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. సోందె అర్జున్‌పై నేరం రుజువు కాకపోవడంతో నిర్దోషిగా భావించి విడుదల చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీడీ లక్ష్మి వాదించగా.. నోడల్ ఆఫీసర్ ప్రవీణ్, లైజన్ ఆఫీసర్ వీరబాబు, తిరుపతి సహకరించారు.

## రామయ్యకు వైభవంగా నిత్యకల్యాణం

భద్రాచలం, మే 1: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో గురువారం స్వామివారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు కల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకర్రబెల్లం, మాంగల్యదారణ, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

## సమక్క సారలమ్మ జాతర ప్రారంభం

అశ్వారావుపేట రూరల్, మే 1: మండల పరిధిలోని కొత్త అల్లిగూడెం గ్రామంలోని సామక్క-సారలమ్మ జాతరను గురువారం ప్రారంభించారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం పూజారులు కోర్స కిశోర్, ఎడమ వెంకమ్మ పూజలు నిర్వహించారు.

## ఉపాధి హామీ ఉద్యోగుల పెన్‌డౌన్

దమ్మపేట రూరల్, మే 1: ఉపాధి హామీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా గురువారం పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. దమ్మపేట ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి పెన్‌డౌన్ చేశారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు వేముల సుధాకర్‌రావు మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, మంత్రి సీతక్క ఇచ్చిన హామీ మేరకు పేస్కేల్ ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## ఇంటి పన్నులో 5 శాతం రాయితీ

ఇల్లెందు, మే 1: ఎర్లీ బర్డ్ స్కీమ్ ద్వారా ఇంటి పన్నులో 5 శాతం రాయితీ పొందుటకు మే 7 వరకు గడువు పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆలయానికి విరాళం

పినపాక, మే 1: మండలంలోని ఏడూళ్ళబయ్యారంలోని సాయిబాబా ఆలయానికి గ్రామానికి చెందిన సూరెడ్డి సుజాత, తిరుపతిరెడ్డి దంపతుల కుమార్తె సంజనారెడ్డి ఉన్నత ఉద్యోగం సాధించడంతో తన మొదటి వేతనాన్ని రూ.1,55,652ను ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు.

## హరిప్రియ పుట్టిన రోజు వేడుకలు

ఇల్లెందు, మే 1: ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయక్ పుట్టిన రోజు సందర్భంగా పట్టణ బీఆర్‌ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో జగదాంబ సెంటర్‌లోని దిండిగాల రాజేందర్ కార్యాలయంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.

టేకులపల్లి: మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ పుట్టిన రోజు సందర్భంగా బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బోడ బాలునాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కేక్ కట్ చేశారు.

## గోనె రామారావుకు శ్రమశక్తి అవార్డు

బూర్గంపాడు, మే 1: మేడే సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శ్రమశక్తి అవార్డులను ప్రధానం చేశారు. బూర్గంపాడు మండలం సారపాక ఐటీసీ పరిశ్రమ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు గోనే రామారావు రాష్ట్ర కార్మిక శాఖ కార్యదర్శి దాన కిశోర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

## దళారులను ఆశ్రయించొద్దు

అశ్వారావుపేట, మే 1: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం దళారులను ఆశ్రయించొద్దని ఇన్‌చార్జ్ ఎంపీడీవో డి.రామారావు అన్నారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని, గురువారంతో లబ్ధిదారుల జాబితా తనిఖీ పూర్తి అయినట్లు తెలిపారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తనిఖీ చేసిన జాబితాలను శుక్రవారం పంచాయతీల వారీగా ప్రజల పరిశీలన కోసం ప్రదర్శనలో ఉంచుతామని చెప్పారు. మండలంలో మోడల్ విలేజ్‌తో కలుపుకుని 812 ఇందిరమ్మ ఇళ్ళు మంజూరైనట్లు స్పష్టం చేశారు. మున్సిపాలిటీలోని 136 ఇళ్ళు కేటాయించినట్లు చెప్పారు.

## టెన్త్ ప్రభుత్వ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

చుంచుపల్లి, మే 1: రుద్రంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గ్రామస్తులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మండల టాపర్‌గా నిలిచిన సుహానా అనే విద్యార్థినికి అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్ - లావణ్య అనే దంపతులు తమ కుమారుడు రితీష్ జ్ఞాపకార్థంగా నగదు అందించారు. టాపర్‌గా నిలిచిన సుహానాతోపాటు లక్ష్య, దీక్షిత, హారిణి, రేణుకలను ఈ సందర్భంగా గ్రామస్తులు, దాతలు అభినందించారు.